# మన(సు)లో మాట

ఎందరో మహానుభావులు ... అందరికీ వంద వందల వందనములు. మా మిత్రులు, సోదర తుల్యులు అనేకులు వ్యక్తం చేసిన ‘మంచి తెలుగు పత్రిక చదివి చాలాకాలమయింది. ఈ మధ్య చదవడం కూడా మరచిపోతున్నాము. Internetలో చదివినా పుస్తకము చేతబూని చదవడం వల్ల కలిగే ఆహ్లాదము వేరు. మెదడుకు పదును పెట్టే సమస్యలు, చలోక్తులు, రమణీయమైన పద్యాల జిగిబిగి లాంటి విషయాల కరువు ఏర్పడుతున్నాది.‘ అన్న మాటలు మా మస్తిష్కంలో ఓ త్రైమాసిక పత్రిక (Quarterly magazine) ప్రచురిస్తే అనే ఆలోచన కలిగించినాయి. ఈ విధంగా మేము నేర్చుకొనేటందులకు, నలుగురికి నేర్చుకొనే అవకాశం కల్పించేందుకు సాధ్యమౌతుందని భావించాము. దీనికి ప్రత్యక్షముగానూ, పరోక్షముగాను సహకరించిన వారందరికి మా ధన్యవాదములు.

ఇక్కడ ‘మేము‘ అని వ్రాయడములో ఉద్దేశ్యము, ఇది ఒక్కరి గొంతు కాదని విన్నవించుకొంటూ - సంపాదకుడు ఒక వ్యక్తి కాదు, ఎంతోమంది పాఠకుల సామూహిక శక్తి. ఎంతో మంది గళములతో, మరెంతో మంది కలములతో, ఎంతో మంది వ్యక్తుల ఊపిరితో జీవించే వ్యక్తి అనే వాస్తవము మీకు తెలియనిది కాదు. ప్రతివ్యక్తి ఏదో ఒక కళలో నిష్ణాతుడు కావచ్చు. కాని అతనికి ప్రేరణ కలిగినప్పుడు, అతనిలో నిద్రాణమై ఉన్న ఆ శక్తిని మేల్కొలిపి నప్పుడే అతనిలోని కళ బహిర్గతమయ్యేది. ఈ పత్రిక ద్వారా ఏ కొద్దిమంది కళాకారులనైనా మేము ఈ లోకానికి పరిచయము చేయగలిగితే అది మా అదృష్టముగా భావిస్తాము.

ఈ పత్రిక ప్రగతికి మనమందరం కలసి పనిచేద్దాం. విజయాన్ని అందరము పంచుకుందాం. ఇది మనందరిది, మనందరికోసం నిర్మించుకున్న సౌధం. ఈ పత్రిక చతుషష్టి కళలకు అద్దం పట్టాలనేది మా ఆకాంక్ష.

‘తెలుగు దేలయన్న దేశంబు తెలుగేను - తెలుగు రేడ నేను తెలుగొకండ - ఎల్లవారు  వినగ ఎరుగవే బాసాడి - దేశ భాషలందు తెలుగు లెస్స‘ అన్న శ్రీకృష్ణదేవరాయల వాక్కు మనందరిలో తెలుగు సౌందర్యోపాసన చేయడానికి స్ఫూర్తి నీయగలదని ఆశిస్తూ

సంపాదక బృందం.

ఈ సంచికలో ఇవ్వబడిన ‘పదచదరంగం‘, ‘పొడుపు కథలు‘, ‘చెప్పుకోండి చూద్దాం!‘ల సమాధానములు తపాలా లేఖ (Snail mail) ద్వారా గాని లేదా E-mail ద్వారా గాని పంప వచ్చు. విజేతల పేర్లు వచ్చే సంచికలో ప్రచురింపబడతాయి. మీ సమాధానములు అందవలసిన ఆఖరు తేది నవంబరు 30. అదేవిధంగా మీరు ఏవైనా సలహాలు, వ్యాసాలు, కథలు లాంటివి కూడా నవంబరు 30 లోగా పంపిస్తే, అవకాశాన్ని బట్టి వాటిని వచ్చే సంచికలో  ప్రచురించగలము.

మా చిరునామా:

Editor
12612 Sauterne Dr.
Apt A
St. Louis
MO 63146

Electronic Mail: ainapura@yahoo.com